# జైలుబడి




క్రేన్ కథోత్సవం - 2006 కథల పోటీలో
తృతీయ బహుమతి పొందిన కథ

## శిరంశెట్టి కాంతారావు

'ఠాంగ్, ఠాంగ్, ఠాంగ్, ఠాంగ్, ఠాంగ్.........'

"ఏమే మంగా ! విన్పిస్తుందా?"

"........................."

"ఐదౌతుందన్నా మాట్లాడవేమే? అవతల ఆ పాలు కాస్తా ఐపోతే ఉంటుంది తమాషా. ఇంటి నిండా చుట్టాలున్నారన్న భయం కూడా లేదు నీకు ఐనా, నా సోది నాదేనా? లేచేదేమైనా ఉందా?

"లేస్తున్నా పెద్దమ్మగారూ! రాత్రి పడుకొనేప్పటికి పదకొండైంది. ఐనా ఆ 'పాలబ్బాయ్ మన పాలు మనకుంచుతాళ్ళే భయపడకండి"

"అదేనే నీకీ మధ్య తెల్వితేటలెక్కువైనాయ్. గుడ్ల మీది కోడిలా ముప్పొద్దులా మేస్తున్నావ్‌కదూ? అలాగే ఉంటుంది. మరి?"

"ఔన్లే పెద్దమ్మ గారూ ! అడుగూ బొడుగూ తింటే తెల్వి తేటలట్లాగే ఉంటాయ్‌లెండీ !"

"ఒసేవ్ ! ఏం మాట్లాడుతున్నావే? మాటంటే చాలు మీదుంచుకోకుండా ఎదురు చెప్పటం నేర్చావ్ ! ఐనా మీ లేబరోళ్ళ బుద్ధులు అంతేలే ! ఖమ్మగా నాల్గు మెతుకులు దొరికితే చాలు, కళ్ళు నెత్తికెక్కి కూర్చుంటాయ్. నాలుగేళ్ళు వానల్లేక, కూలీకి పిల్చేనాదుళ్ళేక, ఆ పల్లెటూళ్ళో కూటికి చస్తున్నామని.... మీ అయ్యొచ్చి బ్రతిమాలితే పోన్లే పాపం! పేద ముండా కొడుకు, నల్గురు పిల్లలు తుక్కల్లే ఉన్నారు

లెమ్మని నిన్ను ఇంట్లో పెట్టుకున్నందుకు ఇలా నెత్తికెక్కి కూర్చుంటున్నావ్!

"............ కళ్ళు నెత్తికెక్కి నేనేం చేశానో ? ఐనా హాస్టల్లో ఉండి చదువుకుంటా నాన్నా అన్నా, వినకుండా దెచ్చి ఈడ పడేసి నందుకు వాళ్ళననాలి. పొద్దు గూకులు చాకిరి చేస్తూనే ఉన్నా ఏదో ఒకటి అంటూనే ఉంటారు."

"అబ్బా ! అత్తయ్యా ! తెల్లారిందా ? అసలే ఇవి అపార్టుమెంట్లు! పొద్దున్నే – ఎవరైనా వింటారేమోనన్న ధ్యాస గూడా లేదు మీకు" "పని పిల్లని పని పిల్లలా కాకుండా సొంత పిల్లలా నెత్తికెక్కిచ్చుకుంది కాక, నా నోరే మూయించాలని చూస్తున్నావా?

"......... మంగా ! ఆ పాలేవో పట్రారాదు."

"చెప్పులు తెగిపోయి వారం రోజులౌతుందమ్మా ! బయటకు వెళదామంటే భయమేస్తుంది. ఊర్కే నీళ్ళల్లో నాని కాళ్ళు పాచిపోయి పుండ్లు పడ్డాయి. రోడ్డు వెడల్పు కోసం తోలిన కంకరంతా రోడ్డు నిండా పడి నడుస్తుంటే కత్తుల్లా గుచ్చుకుంటున్నాయ్."

"అయ్యో ! ఈ విషయం నిన్న కూడా చెప్పావ్ కదూ ? మర్చేపొయ్యా. ఇవన్నీ ఎందుక్కాని డబ్బులిస్తా నువ్వే వెళ్ళి కొనుక్కో పో."

✷ ✷ ✷

"హాయ్ ! ఏంటి ఈరోజు లేటైంది? పొద్దున్నే నువ్ కన్పించక పోతే నా మూడౌటౌతుందెరికేనా?

"ఏయ్ ! నువ్ రోజూ నన్నిలా ఏడ్పిన్తున్నావని మా అయ్యగార్కి చెబుతానేమనుకున్నావో?"

"చెప్పుకో నాకేమొద్ది? నువ్వే నాతో పరాచికాలాడుతున్నావని చెబుతా"

"ఏంటి మంగా ! నువ్వింకా ఇక్కడే ఉన్నావా ? అవతల పాలకోసం పెద్దమ్మగారెదురు చూస్తున్నారు కదూ ?"

"అయ్యగారూ ! ఈ వాచ్‌మెన్......"

"మంగా వచ్చేనరికి చాయ్ తాగొద్దామని ఇప్పుడే అటెళ్ళొస్తున్నా సార్ !"

"సర్లే త్వరగా గేట్ తాళం తీయ్ మంగా ! ఈరోజు వాకింగ్‌కి నేనూ ఆ ౘబూత్ వైపే వస్తాగాని పదా......"

"....... అమ్మో ! ఈ వాచ్‌మెన్ గాడెంత గుండెలు దీసిన బంటో ! బైటికి పోతుంటే, వస్తుంటే మాటి, మాటికీ నన్ను సతాయిస్తున్నాడని చెప్పినా అయ్యగారు నమ్మనంత గొప్పగా నటిస్తున్నాడు గదూ...... !"

✷ ✷ ✷

"వెధవది ! పాలప్యాకెట్లు పట్టుకురావడానికింత సేపా ? పొద్దున్నే ఎక్కడాడుతున్నావ్?" ఎవరితో యవారం పెట్టావ్?"

"..... ఆడుకునే అదృష్టమే ఉంటే, ఇక్కడెందుకుంటా ? ఈ చలిలో ఎందుకు చస్తా ?"

"బెల్లం గొట్టిన రాయిలా మాట్లాడవేమే మూగ మొద్దా ! అలా చూడు అంట్లెన్నున్నాయో ! త్వరగా కానీ"

"మంగా ! టీ పెట్టావా ? వాకింగేమో గాని, చలికి వేళ్ళు కొంగర్లు పోతున్నై"

"త్వరగా కానీ...."

"......................"

"మంగా ! టాయ్‌లెట్లో నీళ్ళు రావట్లేదు గాని, కిందకెళ్ళి వాచ్‌మేన్ని మోటరెయ్యమని చెప్పో. అసలే ఇంటి నిండా చుట్టాలు. ఈ లోపు కరెంటు పోయిందంటే చస్తాం మరి. "

"ఎళ్తానమ్మా !"

"మంగా ! మంగా !"

"ఏంటి బుజ్జమ్మా !"

"కొంచెమిా తెలుగు హోం వర్క్ రాసిపెట్టు. వెధవ తెలుగు వత్తులు, పొల్లులు ఏంటేంటో రాయాలంటేనే చిరాకు ముంచు కొస్తుంది. ఆ తెలుగు టీచరో చాదస్తంది. హోంవర్క్ హోంవర్కని వేపుకుతింటుంది.దానికి తోడు నాన్నేమో మాతృభాష, మాతృభాషంటూ ఈ తెలుగుసోదంటా భట్టీ పట్టమంటుంటాడు."

"................ ఇప్పుడు బడికెళితే నీలాగే నేనూ తొమ్మిదో క్లాస్ చదువుతుందును. నా హోంవర్కులు నేనే రాసుకొందును. నా చేతి రాత ముత్యాలు పర్చినట్టే ఉంటాయని తెలుగు మాష్టారు తెగమెచ్చుకొనేవారు."

"ఏంటీ మాట్లాడవే ?" !

"చేతిలో పనులైంతర్వాత రాసి పెడతాలే బుజ్జమ్మా !"

"హో ౘబామ్మా ! చూడవే... మంగా"

"ఏదో చిన్నపిల్ల. అడిగినందుకన్నా రాసి పెట్టొచ్చు గదే."

"ఏంటత్తయ్యా మీరు మాట్లాడేది?! హోంవర్కిచ్చేది ఎవరితోనో రాయించుకోడాని క్కాదు. ఎవరిది వాళ్ళే రాయాలి. ఐనా అది కూడా చిన్నపిల్లే. తనూ స్కూల్‌కెళ్ళుంటే అదే క్లాసులో ఉండేది. దాని పేదరికమే దాన్ని మనింట్లో పనిపిల్లను చేసింది. ఇంటెడు పని ఒంటి చేత్తో చేసుకొస్తుంది. పొద్దున్నే లేచి హోంవర్కు చేసుకోవడానిక్కూడా బద్ధకమైతే చక్కగా స్కూలు మానేసి ఎంచక్కా టి.వి. చూస్తూ ఇంట్లో కూర్చొమ్మని చెప్పండి మీ మనవ రాలికి."

"దేనికైనా పెట్టిపుట్టాలి మరి. నా మనవరాలికేం మహారాణి"

"పో..... మమ్మీ ! నువ్వెప్పుడిలాగే మాట్లాడుతావ్! నాకంటే నీకా పనిమ్మాయంటేనే ఇష్టం గానీ."

"ఛీ నోర్ముయ్. ఇంకోసారి నా ముందు మంగాని పనమ్మాయి అన్నావంటే చెంపలు పగలగొడతానేమనుకుంటున్నావో?"

"ఏంటోయ్ ! పొద్దున్నే పిల్లనేడిపిస్తు న్నావెందుకు?"

"ఎందుకా మనకూతురి గొప్పతనం జూసి"

"అదా సంగతి ఇంకెప్పుడనదులే గాని ఈసారికి వదిలేయ్. మంగా నువ్వెళ్ళి నా షేవింగ్ కిట్ పట్రాపో..... అసలే లేటైపోయిందీ వేళ."

"మంగా ! ఏం జేస్తున్నావ్?"

"అయ్యగారి షూ పాలిష్ చేస్తున్నా నమ్మా !"

"త్వరగా కానీ, ఈ కూరగాయలు తరుగుదు గానీ"

"................."

"మంగా ! ఇవ్వాల మంగళవారం కదా? మర్చిపొయ్యావా? ఆంజనేయస్వామి గుళ్ళో ఆకుపూజ చేయించాలి. బుజ్జమ్మగారిని వ్యానెక్కించి వస్తూ, వస్తూ ఆ సత్తార్ పాన్‌షాపు లో తమలపాకుల కట్టొహటి పట్రా"

"............. ఈమె పూజలేమో గాని

నా ప్రాణం తీస్తుంది."

"మంగా ! నా ఇస్త్రీ బట్టలెక్కడ పెట్టావో ఇటు పట్రా !"

"తెస్తాను బాబూ !"

"మంగా ! ఈ టీలు పట్టుకెళ్ళి ఆ పక్క గదిలో ఉన్న చుట్టాలకిచ్చిరా"

"అయ్యగారి బట్టలిచ్చొస్తానమ్మా !"

"మంగా ! స్కూల్ టైమ్ ఔతుంది. బాత్రూమ్‌లో త్వరగా వేణ్ణీళ్ళు పెట్రా"

"ఇప్పుడే పెట్టొచ్చాను బుజ్జమ్మా ! స్నానం చెయ్ ఫో."

"మంగా ! కిందికెళ్ళి కాసిని పూలు కోసుకురా పో..... దేవునికి మాల కట్టాలి."

"బుజ్జమ్మను వ్యానెక్కిచ్చి వచ్చేటప్పుడు తమలపాకుల్తో పాటు, పూలు కూడా కోసు కొస్తాలే పెద్దమ్మగారు!"

"అమ్మో ! నువ్ కాలాంతకురాలివే ! బోడి గుండుకూ మోకాలికీ ముడేస్తావ్ !"

"....................."

"మంగా ! కిందకెళ్ళేటప్పుడు ఈ ఫైళ్ళన్నీ తీసుకెళ్ళి కార్లో పెట్టిరా. ముందా పేపరిటు పట్రా ఈ రోజసలు పేపరే చూళ్ళేదు."

"అబ్బో ! ఈ అమ్మాయెవరో కాని ఎంతదృష్టవంతురాలో? రాష్ట్రపతంతటోడి దృష్టిలో పడి రోడ్డు పక్క రాళ్ళు గొట్టేది కాస్తా బళ్ళోకి బొయ్యి చదువుకునే భాగ్యానికి నోసు కుంది. నాలాంటి దానికి అంత అదృష్టం ఎన్నడు రావాలా ?"

"....................."

ఏంటి మంగా ! పేపర్ తెమ్మంటే ఇక్కడ నిల్చుని చదువుకుంటున్నావా

"సర్లే గాని,. మధ్యాహ్నం ఆ కారు షెడ్డంతా క్లీన్ చెయ్యి. షెడ్డంతా చెత్తా, చెదారం పేరుకుని చండాలంగా తయారైంది."

"చేస్తానయ్యా !"

"ఇదుగో మంగా ! పాపను వ్యానెక్కించిరా పో "

"పదండి బుజ్జమ్మగారూ !"

"ఈ బ్యాగ్ తీసుకో మరి."

".........హమ్మయ్యా ! ఆ వాచ్‌మెన్ పోకిరోడు డ్యూటీ దిగినట్టుంది. ఈ ముసలాయ నొచ్చాడు. ఈ అపార్టుమెంట్లల్లో పనిచేసే పిల్లల్ని జూస్తే చాలు వాచ్‌మెన్లకి, ఎలక్ట్రీషియన్లకి,

# నానీలు

కళకళలాడుతోంది
ఇల్లు
విద్యుత్ కాంతితో కాదు
కన్నతల్లి ప్రేమతో

కులాల కుళ్ళు
కడగటానికి
సోపుకాదు కావాల్సింది
దైవం లాంటి పోపు

ఎయిడ్స్‌ను ఛీదరించు
కానీ !
ఎయిడ్స్‌రోగిని
మాత్రం ఆదరించు

వ్యసనం లేని వారు
యువత కానే కాదని
అంటోంది
నేటి గుట్కా

కాకిరంగు
నలుపే కావచ్చు
కాకి మనసు మాత్రం
ఐకమత్య పిలుపు

నేటి హీరోయిన్
నిక్కర్ చూస్తూ
చీర సిగ్గుతో
చితికిపోయింది

రోడ్డు కిరువైపులా
బ్లీచింగు పొడరు
ఓహో ! మంత్రివర్యులు
రాక కాబోలు

- ఈ వేమన

ప్లంబర్లకు అందరికీ అలుసే. ప్రతోడు ఏదో ఒక వంకరమాట మాట్లాడుతూనే ఉంటాడు ! చెప్పుకుందామంటే మాకిక్కడ అమ్మా? అయ్యా? రేయింబవళ్ళు పని చేయించుకునే వాళ్ళే గాని ఇట్లాంటి వి పట్టించుకునే వాళ్ళెవరు? పొరపాటున ఎప్పుడైనా ఓ మాట చెబితే పట్టించుకోకపోగా... మీరు జాగర్తగా ఉండాలి, లేకపోతే ఫలానోళ్ళ పనిపిల్ల ఇలాంటిదంటే మా వరువు పోతుంది అంటూ మమ్మల్నే చివాట్లేస్తారు."

"మంగా ! ఏంటీ ? ఎప్పుడు చూసినా ఏదో ఆలోచిస్తుంటావ్?"

"ఏం లేదు బుజ్జమ్మా ! మా ఊరు, మా బడి, మా అమ్మా, నాన్నా అందరూ గుర్తొస్తుంటారు. వాళ్ళను గురించే ఆలోచిస్తుంటా:....."

"! ! ? ?"

✷ ✷ ✷

"పొద్దున పాపను కొంచెం కిందకు తీసుకెళ్ళి గార్డెన్‌లో ఆడించుకు రమ్మని పంపించడం నాదే బుద్ధి తక్కువ. ఏదో నమ్మక మైన పిల్లకదా అనుకున్నా గాని ఇలా చేస్తుందను కోలే. రెండుతులాలు పెట్టి మొన్నీమధ్యే చేయించాం. ఐనా ఇలాంటి దొంగ బుద్ధులున్నదాన్నెలా ఇంట్లో పెట్టుకున్నారండీ !?

"చూడండమ్మాయిగారూ ! నేనలాంటి దాన్ని కాను. పాపను గార్డెన్లోకి తీసుకెళ్ళినప్పుడు పాప మెళ్ళో చైనుందో? లేదో? కూడా నే చూణ్ణే చూళ్ళే. కొంచేపు ఆడించి తీసుకురమ్మంటే తీసు కొచ్చాను. అంతకు మించి నాకేం తెలియదు."

"వాళ్ళిందాకట్నుంచి బ్రతిమాలు తుంటే ఏంటలా బుకాయిస్తున్నావ్? తమాషా కేమైనా తీశావేమో ఇవ్వరాదూ"

"ఏంటి?! పెద్దమ్మగారూ ! మీరు కూడా అలాగే మాట్లాడతారు? నేనేమైనా దొంగనా అలా తియ్యటానికి !"

"నువ్వు దొంగవు కావే; మీ దరిద్రం దొంగది. దొరికింది కాస్తా దొబ్బేసి మీ అమ్మయ్యకు అందించావనుకో రొక్కం పదివేలు చేతులో పడతాయ్ కదూ ?"

"అట్లాంటి బుద్ధులు మీలాంటి పెద్దోళ్ళకాడే ఉంటాయ్."

"ఏంటే. కూసేవ్?"

"ఛట్, ఛళ్"

"ఆగండాగండత్తయ్యా? ఎందుకు? మంగనలా కొడుతున్నారు ?!"

"ఎందుకా ? మీరటు ఆఫీస్‌కు వెళ్ళగానే ఇటు పద్మ కూతురు మెళ్ళో గొలుసు నొక్కేసింది. చుట్టమై వస్తే...... దయ్యమై పట్టినట్టు ఏదో రెండురోజులు ఉండి పోదామని వచ్చిన చుట్టాల నగలు కొట్టేస్తే ఇంకేమైనా ఉందా ?"

"ఇదుగోండిదేనా ?"

"అరే ! నీ హ్యాండ్ బ్యాగ్‌లోకెలా వచ్చింది ?"

"నా హ్యాండ్ బ్యాగ్‌లోకి రాలేదు? ఆఫీసు నుండొస్తుంటే..... ఆ కారిడార్లో కన్పిస్తే ఎవరిదో? అడిగితే ఇవ్వొచ్చులెమ్మని బ్యాగ్‌లో వేసుకొస్తున్నాను."

"అరే ! ఇంతకుముందు పాప అక్కడే ఆడుకుంది. అప్పుడు గాని పోయిందేమో మరీ వదినా !"

"మరి పొద్దునెప్పుడో పోయిందని మంగనెందుక్కొడుతున్నారు ?"

"................."

"ఊరుకో మంగా ! ఏదో పొరపాటైం దిలే ఏడవకు పెద్దమ్మగారి తొందర నీకు తెల్సిందే కదా ?"

* *

"మంగా ! పెద్దమ్మగార్ని గుళ్ళో దించి మేం ఆఫీసుకెళ్తాం గాని నా హ్యాండ్ బ్యాగ్‌లో ఫెయిర్‌నెస్ కొత్తది పెట్టి, పౌడర్ చల్లి, ఖర్చీఫ్ మార్చు"

''ఎప్పుడో మార్చా నమ్మా"

"సరే వెల్తున్నా తలు పేసుకో"

* *

''నేను గుడికెళ్ళొచ్చిందాకా ఇంకా బట్టలే ఉతుకు తున్నావా?!"

"ఏం జెయ్యమంటా రమ్మా ! మోపెడు బట్టలున్నాయి. ఉతికీ, ఉతికీ నా చేతులు నెప్పెడుతున్నాయ్"

''నొప్పెడతాయ్‌, నెప్పెట్టవ్ మరి ! రాచవారింటి ఆడపడుచువయ్యె. అలాగే నొప్పెడుతాయ్. ఆ బట్టలు తొందరగా కానిచ్చి కంచంలో ఓ ముద్ద పెట్టుకొని ఇంత పెరుగేసి గుజ్జుగా పిసుక్కురా, గుడికెళ్ళొచ్చేనరికి ఎండకు ప్రాణం అన్నుపట్టినట్టవుతుంది."

"మజ్జిగన్నం పిసుక్కు రమ్మంది గాని ఇంకా తినిపియ్యమన్లే నయమే"

"ఏంటే ! నీలో నువ్వే ఏదో గొణుక్కుంటున్నావేంటి ?"

"ఏం లేదు పెద్దమ్మగారు ! రెండవ్వాస్తుంది గదా ? నే గూడా స్నానం జేసొస్తే మీతో పాటు తినొచ్చనుకుంటున్నా."

"అప్పటిదాకా నేనాగలేను గాని ముందు నాక్కొంచెం పెట్టివ్వు".

"......................."

"మంగా ! ఏం జేస్తున్నావ్ ?"

"అన్నం పెట్టుకుంటున్నా"

"తిన్న తర్వాతోసారిలారా !"

".........ఏం తినాలి ? ఏద్దిందామన్నా చల్లగా నోటికి సయించట్లే. ఇదే మా ఇంటి దగ్గరైతే? మా అమ్మ అన్నం ఉడికీ ఉడగ్గానే అందరికన్నా ముందు వేడన్నంలో ఇంత ఆవకాయేసి కలిపి ఒక్కో ముద్దా తిన్పిస్తూ..ఎన్నో ముచ్చట్లు చెప్పేది. ఇప్పుడమ్మేంచేస్తుందో ?"

* * *

"హమ్మయ్య ! నీ తిండి ఇప్పటికైందన్న మాట ! సర్లేగాని ఆ ఝండూబాం ఇలా పట్రా నడుం ఒక్కటే నొప్పిగా ఉంది."

"................."

"ఓసి, నీ పొగరు పొడిచెయ్య గదే ! ఏంటారుద్దడం ? నడుములనుకున్నావా ? లేకపోతే బండరాళ్ళనుకున్నావా ? నీ రుద్దుడుకు నడుం నొప్పి కాదు గదా ! నడుములే పుటుక్కుమని విరిగిపోయేలా ఉంది. ఇష్ట ముంటే రాయ్, లేకుంటే లేదు గాని నా నడుము లిరగొట్టకు తల్లో నీకు పుణ్యముంటుంది గానీ"

"మెల్లగా రాస్తే చేతుల్లో ప్రాణమే లేదంటారు ! కొంచెం గట్టిగా రాస్తే ఇలాగంటారు ! ఇంకెలా రాయాలి మరి ?"

"ఎలాగో తగలడు."

"అమ్మా ! ఇక్కడీ ముసలమ్మతోనూ, ఇంటెడు చాకిరితోనూ చచ్చిపోతున్నానే. నన్నెలాగైనా ఇక్కణ్ణుంచి తీసుకుపోమ్మా ! హాస్టల్లోనే చేరి మళ్ళీ చదువుకుంటానే."

బ్ర్ర్ర్ర్ర్...........

అదుగో మంగా ! చూడెవరో ?

"ప్రసాద్ గారు లేరాండీ!"

"ఆఫీసుకెళ్ళారండీ !"

"మీరెవ్వరండీ ?"

"పనమ్మాయినండీ !"

"పనమ్మాయివా ? సర్లే ! ఆయనొచ్చాక ఈ లెటరిచ్చి, ఆదివారం కలుస్తానని చెప్పు"

"అలాగేనండీ !"

"...........నే పనమ్మాయినని చెప్ప గానే అతని మాట తీరే మారిపోయింది ! మరీ అపార్టుమెంటుల్లో పనిపిల్లలే లేకపోతే......?"

"ఎవ్వరే అదీ ?"


"ఎవరో మరి, అయ్యగారికిమ్మని ఈ లెటరిచ్చెళ్ళారు."

"సర్లే ఆ లెటరక్కడ పడేసి ఆరిన బట్టలు మడతేసి పెట్టి కిందకెళ్ళి రా పో... బుజ్జమ్మొచ్చే వేళైంది."

"పిల్లక్కాసిని చిప్సన్నా వేయించి పెట్టవే! స్కూల్ నుండి అలసిపోయొచ్చిన పిల్ల కదా ! దానిక్కాసిని చిప్సన్నా వేయించి పెట్టి బూస్ట్ కలిపివ్వు"

"........................."

"అదుగో మంగా ! ఆ కారు హారన్ మనదే, మమ్మీ డాడీ వచ్చార్లా ఉంది."



"........................."

"ఏమే ? మాట్లాడవ్ ! పిల్లన్నది విన్పిం చల్లేదా ? కిందకెళ్ళి అయ్యగారి బ్రీఫ్‌కేసూ, ఫైళ్ళు పట్రా పో."

"ఎళ్తున్నానమ్మా"

✸ ✸ ✸

"హుస్స్స్స్... మంగా ! ఈ రోజంతా ఆఫీస్‌లో కరెంటే లేదు. ఒళ్ళంతా చెమట పట్టి కంపు గొడుతుంది. కాసిని వేడినీళ్ళు పడేస్తావా? స్నానం చేయాలి."

"మంగా ! ఈ లెటరిచ్చినాయన ఇంకేమన్నా చెప్పాడా ?"

"మంగా ! నాకు బూస్ట్ కలిపావా?"

"సుమతీ ! త్వరగా తయారవ్వండీ సినిమా, సినిమా అంటూ రోజూ నా ప్రాణం తింటున్నారు. ఇవ్వాళ తప్పితే మళ్ళీ పది రోజుల్దాకా నాక్కుదరదు గాని."

"అలాగేనండీ ! మంగా ! నువ్ గూడా తయారవ్వు వెళదాం !"

"నేన్రానమ్మా ! రాత్రయ్యేసరికి కాళ్ళు సలుపులు పెడుతున్నాయ్."

"అయ్యో ! మర్చేపొయ్యా ! డబ్బులివిగో..... బజారుకెళ్ళి కాళ్ళకు చెప్పులూ, ఆయింట్‌మెంట్ తెచ్చుకో ఫో"

"......................"

"అమ్మా ! గుడి దగ్గరేదో పురాణ ముందన్నవు గదా ? అటెళతావా ? మాతో పాటు సినిమాకొస్తావా ?"

"ఆఁ సినిమా ఏదో బావుందట్రా ! నేనూ సినిమాకే వస్తాలే పదండి."

"సర్లే మంగా ! మేం వచ్చేటప్పుడు ఏదైనా హోటల్లో తినొస్తాం గాని, నీవొక్కదానివే వండుకో మరి !"

"............"

✸ ✸ ✸

"ఛీ, ఛీ, ఛీ,..... వెధవ సిన్మా"

"సరేలేవోయ్ ఏదో ఓ సిన్మా చూశారు గదా ! చూసిందాకా ఓ గొడవ, చూశాక ఓ గొడవ. మీతో ఇదే తలనొప్పి."

"మంగా ! కార్లో పూలు మర్చిపొయ్యొచ్చాను గాని కొంచెం తీసుకొచ్చి మాలకట్టి పెడుదూ. రేపొద్దున్నే మళ్ళీ ఆఫీస్ కెళ్లే హడావిడిలో మర్చేపోతా నేమో గాని."

"......................."

"అర్ధరాత్రౌతుంటే ఇంకా మాలకడుతున్నావా ? కూర్చుని టి.వి.చూస్తున్నావా ? మాల త్వరగా కానిచ్చి లైట్లార్పెయ్. కరెంటు బిల్లు వందలకొంద లొస్తుంది."

"కడుతూనే ఉన్నా పెద్దమ్మగారూ !"

"ఏంటి మంగా ! వారం రోజుల్నుండి చూస్తున్నా ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టే కన్పిస్తున్నావేంటి ? ఒంట్లో బావుండడం లేదా? లేకపోతే మీ వాళ్ళేమైనా గుర్తొస్తున్నారా?"

"అదేం లేదు చిన్నమ్మగారూ ! నేనే మాలోచించట్లేదు. మామూలుగానే ఉన్నాను."

"లేదు, లేదు నీలో ఏదో మార్పు కనబడుతుంది. నీ వాలకం చూస్తుంటే దేనికోసమో ఆలోచిస్తున్నట్టుగా ఉంది. అదేంటో చెబితే బావుంటుంది గాని, అలా పరధ్యానంగా ఉంటే ఏం బావుంటుంది?"

"................"

"సర్లే పడుకో"

✸ ✸ ✸

"అమ్మో ! అమ్మో ! పట్టుమని పద మూడేండ్లులెవ్వు ఎంత పని చేసిపోయింది?! పదిహేను తులాల బంగారం ఎటు తీసుకుపోయిందో? ఏం జేసిందో?"

"అమ్మా ! నువ్వాగు. ఎందుకలా అరుస్తావ్? పోలీస్ కంప్లయింటిచ్చాం గదా ! అదే దొరుకుతుందిలే"

"అవునత్తయ్యా దొరుకుతుందిలే. ఐనా మంగ అలాంటి పనిచేసిందంటే. నాకిప్పటికీ నమ్మబుద్ధి కావడంలే. రాత్రి పడుకునే ముందు కూడా గుచ్చి, గుచ్చి అడిగినా మనసు విప్పి మాట్లాడలేదెందుకో మరి?"

"అసలాముండ అలా తయారవ్వ డానికి నీ అలుసే కారణం. దాని మీద ఒక్క మాట పడనివ్వకపోతివి. చివరికి చూడు ఏం చేసిందో, కొంచపు మనుషులకు కొంచపు బుద్ధిలుంటాయని నేను మొత్తుకుంటున్నా నా మాట చెవిన పెట్టకపోతివి."

"నాన్న నీకే ఫోన్"

"ఆఁ ఆఁ యస్.ఐ గారూ నేనే. ఏంటి!? మంగ సూర్యాపేట బస్టాండ్‌లో తిరుగుతుంటే పట్టుకున్నారా ! ముందు తియ్యలేదని బుకాయించినా స్టేషన్‌కు తీసుకు పోయిం తరువాత తీసినట్టు ఒప్పు కుందా ? ఏంటీ ?! మొత్తం బంగారం దొరికిందా? థాం క్సండీ ! రేపొద్దున్నే నాంపల్లి స్టేషన్‌కి రావాలా? అలాగే సార్ ! వస్తాంలెండి. మా సొమ్ము మాకొస్తే చాల్లెండి. ఆఁ అమ్మాయిని ఏం చేసుకుంటారో మీ ఇష్టం. సరే సార్ ఉంటాను మరి".

"ఏంటండీ దొరికిందటా !?"

"ఔను ! రేపొద్దున్నే నాంపల్లి స్టేషన్‌కి రమ్మని యస్.ఐ. ఫోన్ చేశాడు.

✸ ✸ ✸

"అబ్బా ! ఎన్ని రకాలుగా అడిగినా దొంగతనం ఎందుకు చేసిందో మాత్రం నోరు విప్పి చెప్పలేదు చూశారా అత్తయ్యా !"

"ఔను మరి, తప్పు చేసి దొరికిపోయిం తరువాత ఇంకేం నోరు విప్పుద్ది? మొదట్నుంచి దాన్ని నమ్మొద్దని నేను చెబుతూనే ఉన్నా నువ్వే విన్పించుకోలేదు మరి.

"పాపమా తల్లిదండ్రుల్ని చూస్తుంటే బాధనిపించిందండీ !"

"ఎవరెలా ఏడిస్తేనేంలే మన సొమ్ము మనకు దొరికిందంతే చాలు. ఐనా, ఈరోజుల్లో, ఎవరిని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో అర్థం కావడం లేదు.

"ఔనత్తయ్యా ! దాన్ని మన పాపకంటే జాగ్రత్తగా చూసుకున్న. చివరికిలా చేసిం దంటే... అంతే అనుకోవాలి మరి !"

✸ ✸ ✸

ఇంటికి వచ్చిన చుట్టాలు, తియ్యని గొలుసు తీశానని తిట్టి, కొట్టినా నాకు మేలే చేశారు. అప్పుడే గదా నాకు ఈ జైలు బళ్ళో చేరి చదువుకోవాలనే ఆలోచన వచ్చింది. దాని కోసమే కావాలని దొంగతనం చేశాను గాని నిజంగా దొంగతనం కోసం కాదని నలుగురూ తెలుసుకొని మెచ్చుకునేలా చదువుకోవాలి."

"అలివేలు మంగతాయారూ ! అలివేలు మంగతాయారూ !" తొమ్మిదో తరగతి క్లాస్ టీచర్ హాజర్ పట్టి చూస్తూ పిలిచిన పిలుపుకు "ఆ బాల నేరస్తుల పాఠశాల" గోడలు ప్రతిధ్వనించాయి.